ఖరీఫ్ ప్రణాళిక ఖరారు

- పనులకు సిద్ధమవుతున్న రైతులు
- నియోజకవర్గంలో 92 వేల ఎకరాల్లో పంటల సాగు



దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచిన భూమి

నందిపేట్(ఆర్మూర్): రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధం అవుతున్నారు. సాగుకు అవసరమయ్యే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రైతులంతా పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. వారం రోజుల నుంచి దుక్కులు దున్నుతూ పంట భూములను చదును చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులను సమకూర్చుకుంటున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలో సుమారు 92 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు వాతావరణం అనుకూలిస్తుందనే భరోసాతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. నేలను దున్ని తదుపరి సాగుకు సిద్ధం చేస్తున్నారు. భూసారం పెంచడానికి భూముల్లో ఎరువులు, నల్లమట్టిని పోసుకుంటున్నారు. తొలకరి జల్లులు కురవగానే విత్తడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా చెరువులు, కుంటలు, ఎత్తిపోతల ఆధారంగా పంటలు సాగు చేస్తారు. నందిపేటలో పదకొండు, ఆర్మూర్ మండలంలో మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. వీటి కిందనే ఎక్కువగా సాగు విస్తీర్ణం ఉంది. కాలం అనుకూలంగా ఉండి ఎస్ఆర్ఎస్పీ పూర్తిగా నిండితే ఆశించిన స్థాయిలో పంటలు సాగవుతాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి భూగర్భ జలాలుపైకి వస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకుంటారు.

ఆర్మూర్ డివిజన్‌లో పంట సాగు వివరాలు(ఎకరాలలో)

పంటలు	ఎకరాలు
వరి	71,676
సోయాబీన్	8,645
పసుపు	5,260
మొక్కజొన్న	6,500
కూరగాయలు	650
ఇతర పంటలు	1200

భూమిని సన్నద్ధం చేశాం

ఖరీఫ్ పనులు ప్రారంభం కాకముందే ముందస్తుగా ఎరువులను తీసుకున్నాం. భూమిని చదును చేసి సిద్ధంగా ఉంచాం. సోయా పంటను సాగు చేసేందుకు ముందస్తుగానే విత్తనాలను కూడా సిద్ధం చేశాం.

– చిన్నారెడ్డి, నందిపేట్, రైతు

ఏర్పాట్లు చేస్తున్నాం

రైతులు ఖరీఫ్ సీజన్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తాము క్షేత్ర స్థాయిలోకి వెళ్లి ఏ నేలలో ఏ పంటలు వేయాలో సలహాలు ఇస్తున్నాం. విత్త నాలు, ఎరువుల నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– విజయలక్ష్మి, ఏడీఏ

క్లుప్తంగా

ఆర్మూర్ ఆర్డీవో బదిలీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఆర్డీవో శ్రీనివాసులు బుధవారం బదిలీ అయ్యారు. 2018లో ఆర్మూర్ డివిజన్ ఆర్డీవోగా ఆయన బాధ్యతలు చేపట్టారు. బదిలీపై మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్‌కు ఆర్డీవోగా వెళ్లారు. ఆయన స్థానంలో నిజామాబాద్ ఆర్డీవో రవి అదనపు బాధ్యతలు స్వీకరించారు. బదిలీపై వెళ్తున్న ఆర్డీవో శ్రీనివాసులును తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ చూపాలి



రుద్రూర్: పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని బోధన్ డీఎల్‌పీవో గౌసుద్దీన్ సూచించారు. చందూర్ మండలం మేడిపల్లి తండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించారు. పల్లె ప్రగతి పనుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలు వస్తే త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేయద్దన్నారు. పంచాయతీ కార్యదర్శి సీతారాం ఉన్నారు.

వీడీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆకుల భాజన్న, కార్యదర్శిగా తోపారపు గంగాధర్, న్యాయశాఖ సదార్‌గా అల్లకొండ గంగాధర్, ఉప సదార్‌గా పెసరి నారాయణ, కోశాధికారిగా సక్కారం నర్సారెడ్డి, దేవదాయశాఖ సదార్‌గా అంకడి రాజశేఖర్, నీటి శాఖ సదార్‌గా సింగారపు ఎల్లయ్య, అటవీశాఖ సదార్‌గా గోపు చిన్న ముత్తెన్నలను ఎన్నుకున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



బోధన్: సాలూర మండల కేంద్రంలోని సొసైటీలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం చైర్మన్ అల్లె జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మక్క కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం మక్క క్వింటాలుకు రూ.1962 ధర చెల్లిస్తోందని తెలిపారు. సొసైటీ డైరెక్టర్ గంగారాం, సీఈవో బస్వంత్‌రావు పటేల్ పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిజామాబాద్ డీఎల్‌పీవో నాగరాజు సూచించారు. బుధవారం న్యాల్‌కల్‌లో డంపింగ్ యార్డ్, కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించారు. అదేవిధంగా ఇంకుడు గుంత నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని, ఇంటింటికి చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ గంగాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

ఖలీల్‌వాడి: తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకు కొత్తగా వచ్చిన ఐసీడీఎస్ పీడీని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జిల్లాలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. బియ్యం, గుడ్లు, పప్పులు, నూనె అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో చేర్చకపోవటంతో లబ్ధిదారులకు అందించలేకపోతున్నామని పీడీ దృష్టికి తెచ్చారు. రోజువారి పని ఒత్తిడి ఉండటంతో పాటు ప్రభుత్వం బీఎల్‌వో డ్యూటీలను వేయటం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించటానికి తన వంతు సహాయం చేస్తానని పీడీ యూనియన్ నాయకులతో చెప్పారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రమేష్ బాబు, జిల్లా అధ్యక్షులు దేవగంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి



ఆర్మూర్ పట్టణంలో సమ్మె చేస్తున్న వీవోఏలు

ఆర్మూర్‌టౌన్: వీవోఏలకు కనీస గౌరవ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఐకేపీ వీవోఏ అధ్యక్షురాలు సువర్ణ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని చౌరస్తా వద్ద వీవోఏ చేస్తున్న సమ్మె శిబిరం వద్ద ఆమె మాట్లాడుతూ.. వీవోఏలకు రూ.10లక్షల సాధారణ బీమా, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాల, డీఆర్‌డీఏ శాఖ నుంచి నేరుగా వీవోఏల అకౌంట్‌లో వేతనాలు జమయ్యేలా చూడాలన్నారు.



వర్నిలో సమ్మె చేస్తున్న వీవోఏ లు

వర్నిలో..

వర్ని: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వర్నిలో వీవోఏలు చేస్తున్న సమ్మె బుధవారానికి 31వ రోజుకు చేరుకుంది. వర్ని తహసీల్ కార్యాలయం వద్ద వీవోఏల సమ్మె కొనసాగుతోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని వీవోఏల సంఘం వర్ని మండల అధ్యక్షులు షమీం ప్రభుత్వాన్ని కోరారు.

ఆసరా పింఛన్ల పంపిణీ



పింఛన్లను అందజేస్తున్న శ్రీనివాస్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో లబ్ధిదారులకు బుధవారం ఉప సర్పంచ్ ఆసపురం శ్రీనివాస్ రెడ్డి ఆసరా పింఛన్లను అందజేశారు. గ్రామానికి చెందిన 8 మందికి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పింఛన్లను మంజూరు చేయించారు. దీంతో ఉప సర్పంచ్ లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు..

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని దత్తాపూర్‌లో ఇద్దరు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ దిలీప్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్ మహేష్‌కు అభినందనలు



సన్మానిస్తున్న బీజేపీ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి

బోధన్: సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో బోధన్‌కు చెందిన కంఠం మహేష్ కుమార్ 200వ ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం బీజేపీ నియోజకవర్గ నాయకుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి మహేష్ కుమార్ ఆయన సతీమణి సౌమ్యలను శాలువాతో సన్మానించారు. మహేష్ సాధించిన విజయం ఎంతో గొప్పదని ప్రకాష్ రెడ్డి అన్నారు. నేటితరం యువత మహేష్ కుమార్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. నేతలు రామరాజు, శ్రీనివాస్, గంగాధర్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో మంచి లాభాలు



అవగాహన కల్పిస్తున్న అధికారి రోహిత్

డొంకేశ్వర్(ఆర్మూర్): ఆయిల్‌పాం తోటను సాగు చేయడం వల్ల రైతులకు మంచి లాభాలు వస్తాయని ఉద్యాన శాఖ క్లస్టర్ ఆఫీసర్ రోహిత్ అన్నారు. బుధవారం నికాల్‌పూర్‌లో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం మొక్కలను ప్రభుత్వంపై సబ్సిడీపై అందజేస్తుందని, బిందుసేద్యానికి కూడా రాయితీ ఉందన్నారు. నాలుగేళ్లలో పంట చేతికి వస్తుందని, దీనికి మార్కెట్‌లో మంచి ధర లభిస్తుందన్నారు. రైతులు లాభదాయకమైన ఆయిల్‌పాం సాగు వైపు మళ్లాలని కోరారు. ఏఈవో నరేశ్, తదితరులున్నారు.

కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్

వర్ని: కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. బుధవారం అఫంది ఫారంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు, కంటి అద్దాలు కూడా ఇస్తారని, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని చెప్పారు. శిబిరానికి వచ్చే ప్రజలకు స్థానిక అధికారులు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సర్పంచ్ రఘు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శునకాల స్వైర విహారం

బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు



గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోంది. పుర వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ రాకపోకలు సాగించే వారిపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా రోడ్లపై నడవలంటే ప్రాణాలను అరచేతి పెట్టుకోవాల్సిందే. చిన్నారులను ఆటల కోసం బయటకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల వల్ల ఇంటిముందు సైతం చిన్నారులు ఆడుకునేందుకు బయటకు రాలేకపోతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని సైతం కుక్కలు వెంబడిస్తున్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రతిరోజు ఏదో ఒక కాలనీలో కుక్కల దాడి జరుగుతోంది. మామిడిపల్లి ఆదర్శనగర్‌లో కాలనీలో ఇటీవలే కుక్కల దాడి నుంచి చిన్నారులు తృటిలో తప్పించుకున్నారు. ఆర్మూర్ పరిధిలో సుమారు 300పైన కుక్కలు ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిరోజు కుక్క కాటు కేసులు నాలుగు నుంచి ఆరు కేసులు నమోదు అవుతున్నాయి. కొన్ని రోజుల క్రితం సీడీఎంఏ అధికారులు మున్సిపల్ కమిషనర్లకు, సానిటరి ఎస్సైలకు కుక్కల నివారణపై సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఇంకా చర్యలు మాత్రం పూర్తి కాలేదు.

మున్సిపల్ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రగతి పనులను చేపట్టినకాంట్రాక్టర్లకు తక్షణమే బిల్లులు చెల్లించాలని బోధ న్ మున్సిపల్ కాంట్రాక్టర్స్ సంఘం అధ్యక్షులు ఉదయ్ భాస్కర్ రావు డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బోధన్ మున్సి పల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టణ ప్రగతిలో భాగంగా కాంట్రాక్టు పద్ధతిన పనులు పూర్తి చేసి 2 ఏళ్లు అవుతోందని, అప్పటి నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2 నెలల నుంచి గ్రాంట్ రిలీజ్ కావడం లేదని, అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తి చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్న కాంట్రాక్టర్ల పరిస్థితి బాగాలేదని, ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు సన్మానం



లావణ్యను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

డొంకేశ్వర్(ఆర్మూర్): దత్తాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులను అధికారులు, సర్పంచ్‌లు బుధవారం ఘనంగా సన్మానించి అభినందించారు. డిగ్రీ చదువుతున్న లావణ్య ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఆమెను సన్మానించి నగదు ప్రోత్సాహం అందజేశారు. అలాగే తొండకూర్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇటీవల పదవ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థిని భవానీని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో కిరణ్, దత్తాపూర్ సర్పంచ్ లావణ్య, ఉప సర్పంచ్ దిలీప్, డొంకేశ్వర్ సర్పంచ్ చాయచందు, ఎంపీటీసీ గంగాదేవి పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎల్‌వోసీ అందజేత



భాస్కర్‌గౌడ్‌కు ఎల్‌వోసీను అందజేస్తున్న మంత్రి

కమ్మర్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన మడ్డి హరిచందన అనే 8 ఏళ్ల చిన్నారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చిన్నారి కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయించడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన చిన్నారిని హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించారు. చికిత్స నిమిత్తం రూ. 2.50 లక్షల అవసరం కాగా, ప్రభుత్వం నుంచి రూ.2.50 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)ను మంజూరు చేయించారు. ఎల్‌వోసీ ప్రతిని మంత్రి, చిన్నారి తండ్రి మడ్డి భాస్కర్‌గౌడ్‌కు బుధవారం అందజేశారు. మంత్రి వేములకు జీవితాంతం రుణపడి ఉంటామని భాస్కర్‌గౌడ్ తెలిపారు.

సమాచారం..

నేడు స్వర్ణామృతం పంపిణీ

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు సమక్షంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు స్వర్ణామృతం పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. పుట్టిన పసిబిడ్డ నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలతో పాటు గర్భిణీలకు ఈ స్వర్ణామృతం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నేడు మాక్లూర్‌లో జీలుగ విత్తనాల పంపిణీ

మాక్లూర్: మండల కేంద్రంలోని సొసైటీ ప్రాంగణంలో గురువారం జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయ అధికారి పద్మ బుధవారం తెలిపారు. రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్‌తో వచ్చి తీసుకెళ్లాలని చెప్పారు. బస్తా ధర రూ: 843.

రేపు కుట్టు శిక్షణ ప్రారంభం

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో నిరుపేద మహిళల కోసం ఏతూర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫౌండర్ సునీతా రాకేష్ ఆధ్వర్యంలో శుక్రవారం కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు కొత్తపల్లి రమేశ్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వంద మంది మహిళలకు 45 రోజుల శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు శుక్రవారం ఉదయం వరకు సంప్రదించాలని కోరారు.

అడ్మిషన్ల కోసం ప్రచారం



నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వ కళాశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ బుధవారం నందిపేట మండలంలోని అయిలాపూర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెద్ది నారాయణ ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది ప్రచారం నిర్వహించారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు బోధనా పద్ధతుల గురించి వివరించారు. మీ పిల్లలను అయిలాపూర్ జూనియర్ కాలేజీలో చేర్పించాలని వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తామని వివరిస్తూ ప్రచారం చేశారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 –	కస్టడీ - 12.20, 6.30 ది కేరళ స్టోరీ (తెలుగు) - 3.30 విరూపాక్ష - 9.40
స్క్రీన్-2 –	ఫాస్ట్ ఎక్స్(తెలుగు)3డీ- 10.00, 4.00, 10.00 (ఇంగ్లీష్) 1.00, 7.00
స్క్రీన్-3 –	అన్నీ మంచి శకునములే - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	బిచ్చగాడు2 - 12.15, 3.30, 6.45, 10.00

ఆధ్యాత్మికం

అంగరంగ వైభవంగా శిఖర ప్రతిష్ఠాపన



రెంజల్(బోధన్): కల్యాపూర్‌లోని దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డిలు ఆలయంలో పూజలు నిర్వహించగా, గ్రామ సర్పంచ్ కాశం నిరంజన దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



నవీపేట(బోధన్): మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మ, పుట్ట ఎల్లమ్మ ఆలయంలో బుధవారం దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో పూజలు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ముగింపు ఉత్సవాలకు జెడ్పీ చైర్మన్ విఠల్ రావ్, రాష్ట్ర మహిళా సాధికారిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, బీఆర్‌ఎస్ నాయకులు రాంకిషన్‌రావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు ఆసాల్ల శ్రీనివాస్, ఎంపీపీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సుర్బిర్యాల్‌లో..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో నూతనంగా నిర్మించిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ సట్లపల్లి సవిత గణేశ్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీలుగ విత్తనాల పంపిణీ



చందూర్‌లో.. సొసైటీ అధ్యక్షుడు ప్యారం అశోక్



నికాల్‌పూర్‌లో ..



కల్లెడిలో.. వైస్ ఎంపీపీ సుక్కి సుజాత

సాక్షి, నెట్‌వర్క్ : జిల్లాలో పలు చోట్ల బుధవారం సొసైటీల ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను అధికారులతో కలిసి ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా సుమారు 3 ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. బస్తా ధర రూ.843 అని, పట్టా పాస్ బుక్ జిరాక్స్ ఇచ్చి రైతులు తీసుకెళ్లవచ్చని చెప్పారు.

టీబీ బాధితులతో వాల్ పెయింటింగ్



నిజామాబాద్ సిటీ: టీబీ బాధితులతో తాము ఒంటరి అన్న భావన రావద్దన్న ఉద్దేశంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించింది. కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా 24న నిక్షయ్ దివస్ అనే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా టీబీ రోగులలో భరోసా కల్పించేందుకు బుధవారం జిల్లా కేంద్రంలోని అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో టీబీ బాధితులతో వాల్ పెయింటింగ్ వేయించి ఆ బొమ్మలలో రంగులు నింపించి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ సుదర్శనం మాట్లాడుతూ..టీబీ మందులు వాడుతున్న వారు ఇతరులకు ఈ వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్త పడేలా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. 15 మంది టీబీ రోగులు కలిసి ఈ పెయింటింగ్‌ని విజయవంతంగా పూర్తి చేసారని వైద్య అధికారి తెలిపారు. అర్సపల్లి మెడికల్ ఆఫీసర్ మధుసూదన్, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్ పాల్గొన్నారు.